క్లుప్తంగా

22న చెకుముకి టాలెంట్ పరీక్ష



మహాముత్తారం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ములుగుపల్లి, నల్లగుంట మీనాజీపేట, కేజీబీవీ, డొబ్బలపాడ్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఈనెల 22న చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రశ్న పత్రాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు.

ఎస్సైని కలిసిన నాయకులు



రేగొండ : మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను బహుజన విద్యార్థి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల రమేష్, బీఎస్పీ భూపాలపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కొయ్యాడ దామోదర్, బీఎస్‌ఎఫ్ నాయకులు రాకేష్, దిలీప్, గణేష్, భరత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి



రేగొండ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మల్లయ్య గురువారం హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన అనంతరం జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలయ శుద్ధీకరణ



చిట్యాల : మండలంలోని అందుకుతండా హనుమాన్ ఆలయాన్ని కమిటీ సభ్యులు గురువారం శుద్ధిచేశారు. ఈనెల 22వ తేదీన అయోధ్య రామాలయంలో రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయ ప్రాంతాన్ని కమిటీ సభ్యులు శుద్ధి చేశారు. కార్యక్రమంలో సభ్యులు బానోత్ రాజునాయక్, సంఘ తిరుపతి, మురారి తిరుపతి, భూక్యా పవన్ కళ్యాణ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చితోటల పరిశీలన



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో మిర్చితోటలను మండల వ్యవసాయ శాఖ ధికారి మహేష్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు ప్రభుత్వం గుర్తించిన పురుగు మందులు మాత్రమే వాడాలన్నారు. అనంతరం వారికి సలహాలు, సూచనలు అందజేశారు. అధికారుల సలహాలు తీసుకొని పురుగు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. మోసపూరిత మాటలు నమ్మి పురుగు మందులు పిచికారీ చేసి మోసపోవద్దన్నారు.

'ఆదర్శ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాటారం : గంగారంలోని ఆదర్శ(మోడల్ స్కూల్) పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మధు తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఓసీలకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీల విద్యార్థులకు రూ.125 రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్‌లో సంప్రదించాలని తెలిపారు.

నూతన భవనాల ప్రారంభమెప్పుడో?

శిథిల భవనంలోనే కొనసాగుతున్న కార్యాలయాలు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం

మల్హర్ : ప్రజలకు పాలన చేరువ చేసేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు.. అయితే అవి శిథిలమవడంతో నూతన భవనాల నిర్మాణాలకు టెండర్లు పిలిచారు.. కాగా, మొదట కాంట్రాక్టర్ సగం పనులు చేసి చేతులెత్తేశాడు.. మళ్లీ టెండర్ నిర్వహించగా మరో కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు.. ఇక్కడి వరకు బాగానే ఉన్న వాటి ప్రారంభానికి సరైన ముహూర్తం ఖరారు కావడం లేదు.. ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభ కార్యం ఆగిపోయింది.. కోడ్ ఎత్తేసిన నూతన భవనాల ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.. దీంతో పాత భవనాల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

మండల కేంద్రమైన తాడిచర్లలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన తహసీల్దార్ నూతన భవనం అన్ని హంగులతో సుందరంగా ముస్తాబైంది. 2017సంవత్సరం ఆగస్టులో రూ.40లక్షల నిధులతో నూతన తహసీల్దార్ కార్యాలయం పనులు ప్రారంభానికి అధికారులు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అధికారులు బిల్లుల చెల్లింపు ఆలస్యం చేస్తుడడంతో పనులు నత్తనడకన సాగాయి. మొదటి సారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగంగా స్లాబ్ వరకు చేశారు. అనంతరం నిధుల లేమితో అభివృద్ధి పనులు నిలిపి వేశారు. రూ.35లక్షల వ్యయంతో మరో కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనులు అప్పగించారు. ఎట్టకేలకు సదరు కాంట్రాక్టర్ పనులు చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే నూతన భవనాన్ని ప్రారంభిస్తామని అధికారులు నిర్ణయించే లోపే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో కార్యక్రమం నిలిచిపోయింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ ఎత్తివేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో నూతన కార్యాలయాల ప్రారంభానికి మార్గం సుగమమైంది. అయినప్పటికీ అధికారులు కొత్త కార్యాలయాల ప్రారంభానికి చర్యలు తీసుకోవడంలేదు.



శిథిలావస్థకు చేరిన భవనం

శిథిలావస్థలో కార్యాలయాలు

ప్రస్తుతం నూతన కార్యాలయాలు ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరిన పాత భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. 1993 సంవత్సరంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను మావోయిస్టులు పేల్చి వేయడంతో భద్రతా కారణాల దృష్ట్యా వాటిని మంథనికి తరలించారు. దశాబ్ద కాలంగా మంథనిలో కొనసాగిన కార్యాలయాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మండలకేంద్రంలో కార్యాలయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో 2014ఆగస్టులో తాడిచర్లలోని పాత భవనంలో కార్యాలయాలను తరలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నిపాటి వర్షం కురిసిన కార్యాలయంలో భద్రపరిచిన రికార్డులు తడిసి పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలను ప్రారంభించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకు రావాలి. ఇందుకు ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పాత భవన కార్యాలయం పూర్తిగా కూలిపోయే దశకు చేరుకుంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాక ముందే తహసీల్దార్ భవనాన్ని ప్రారంభించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్క సూర్యప్రకాశ్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్, మల్హర్

దాతలు ఆదుకోండి ప్లీజ్..

- బాలుడి వైద్యానికి రూ.6 నుంచి 8లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం
- సాయం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు



దీన గాథ



చికిత్స పొందుతున్న చిన్నారి లక్ష్మణ్

గోవిందరావుపేట : కడు పేదరికం.. ఉండేందుకు ఇల్లు సరిగా లేదు.. వారంకిందట తండ్రి మరణం..ఇప్పుడు మరో వైపు కన్న కొడుకు ఆరోగ్య పరిస్థితి విషమం.. ఏం చేయలేని పరిస్థితిలో తల్లిదండ్రులు.. దాతల ఆదుకోవాలని దీనంగా ఎదురుచూస్తున్నారు.. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని చల్వాయి గ్రామానికి చెందిన వేల్పుగొండ నాగరాజు–మౌనికకు ఇద్దరు కవలలు రామ్, లక్ష్మణ్. వృత్తిరీత్యా నాయీబ్రాహ్మణులు. వారం కిందటే నాగరాజు తండ్రి కుమారస్వామి అనారోగ్యంతో మృతి చెందారు.కర్మకాండలు కూడా పూర్తి కాక ముందే ఇంట్లో మరో విషాదం చోటు చేసుకుంది. అల్లారు ముద్దుగా సందడిగా ఆడుకునే మూడేళ్ల చిన్నారి లక్ష్మణ్ ఆడుకుంటూ కింద పడ్డాడు. దీంతో తలకి గాయమైంది.

ఆస్పత్రికి తీసుకెళ్లగా..

వెంటనే ములుగులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం చేర్పించారు. చిన్నారిని పరిక్షించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డ కట్టిందని, త్వరగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. కాగా, ఆపరేషన్‌కు రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో, చేతిలో చిల్లిగవ్వ లేని తల్లిదండ్రులు దాతలు సాయం చేసి తమ కుమారుడికి ప్రాణ భిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

దాతలు ఫోన్ పే నంబర్ 80089 94920 (వేల్పుగొండ నాగరాజు)కు సాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మొగుళ్లపల్లి : బలహీన వర్గాల అభివృద్ధికి రిజర్వేషన్లు కల్పించారని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు.గురువారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు పుల్ల ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా మంగళపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జనుప మేఘనాథం, గౌరవ అధ్యక్షుడిగా సుదమల్ల కిషన్, కార్య నిర్వహక అధ్యక్షుడిగా నిమ్మల భద్రయ్య, ఉపాధ్యక్షులుగా మంది తిరుపతి, రేణికుంట్ల చందర్, కోశాధికారిగా శనిగరపు శ్రీనివాస్, కార్యదర్శిగా ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా రవికుమార్, ప్రచార కార్యదర్శిగా సాంబయ్య, సుమన్, ముఖ్య సలహాదారులుగా రాజు, రవీందర్, రామస్వామి, సుధాకర్, సదయ్యను ఎన్నుకున్నారు.

ఈసందర్భంగా పుల్ల మల్లయ్య మాట్లాడుతూ.. మహానుభావుడు డా.బీఆర్ అంబేడ్కర్ బలహీన వర్గాల అభివృద్ధికి రాజ్యాంగంలో ఏర్పర్చిన రిజర్వేషన్లు ఉపయోగించుకోని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం నూతన యువజన సంఘం మండల కమిటీని ప్రకటించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మొగుళ్లపల్లి : మండలంలోని ఇస్సిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులందరు ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను మెమోంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, వెంకటనర్సయ్య, ప్రభాకర్, హుస్సేన్, బ్రహ్మానందం, రవీందర్, మల్లయ్య, మాధవితో పాటు విద్యార్థులు బాలవేణి వీరస్వామి, ఆదిరెడ్డి, తిరుపతి, మల్లయ్య, రాజు, భాస్కర్, రమేష్, విద్యాసాగర్, శ్రీను, చిరంజీవి, స్వర్ణలత, ధనలక్ష్మి, రజిత, మమత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ టోర్నీ



బహుమతి అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో లేతకరి మల్లయ్య స్మారక షటిల్ టోర్నమెంట్‌ను తన కుమారుడు రాజబాపు ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించారు. బుధవారం రాత్రి టోర్నీ ముగిసింది. విజేతలుగా నగునూరి రాజు, అభి మొదటి బహుమతి సాధించారు. రెండోవిజేతగా రాజబాపు, మేకల నరేష్ నిలిచారు. వారికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాసరెడ్డి, నాయకులు జానీ, గందెసరి సత్యనారాయణ, హైదర్, షకీల్ బహుమతులు ప్రదానం చేశారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రవీందర్, సంఘం సభ్యులు

ఎస్ఎస్ తాడ్వాయి : కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మేడారం ఐటీడీఏ గెస్ట్‌హౌస్ ఆవరణలో బయ్యక్కపేట సొసైటీ అధ్యక్షుడు ఎరుకలి గోవిందరాజు అధ్యక్షతన కల్లుగీత కార్మికుల సంఘం క్యాలెండర్–2024ను తహసీల్దార్ రవీందర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కల్లు దుకాణాల ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని, తాటిచెట్ల పెంపకానికి భూములు కేటాయించి గీత వృత్తిని బలోపేతం చేయాలన్నారు. గీత కార్మికులకు ప్రమాదం జరిగిన నెల రోజుల్లో గ్రామ పంచాయతీ తీర్మాణం ప్రకారం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని దానిని వెంటనే అమలు చేసేలా జీఓ విడుదల చేయాలని కోరారు. ఏజెన్సీలో బెల్ట్ షాపులతో కల్లు గీత కార్మికులకు ఉపాధి కరువైందని, వెంటనే వాటిని అరికట్టి గీత కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, జెడ్పీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బత్తిని రాజు, నాయకులు తమ్మల సమ్మయ్య, బెల్లంకొండ రోషయ్య, గడ్డం శ్రీధర్, రాజు, కిరణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గోవిందరావుపేట: చల్వాయిలో..

గోవిందరావుపేట : కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చల్వాయి గ్రామ సొసైటీ కల్లు మండువ వద్ద ములుగు జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వృత్తిని ప్రతిబింబించేలా క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. మెడికల్ బోర్డ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏజెన్సీ పేరుతో రద్దు చేసిన కల్లు గీత సొసైటీలను పునరుద్ధరించి గీత కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. వృత్తిలో భాగంగా ప్రమాదాల నివారణకు తక్షణమే సేఫ్టీ మోకులు అందించాలని, గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వాలన్నారు. టాడీ కార్పొరేషన్‌కు నిధులు పెంచాలని పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, కార్పొరేషన్ చెక్కులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోనగాని సారయ్య, వత్సవాయి సారయ్య, మాచర్ల ఏలేంద్రం, అన్నపురం సదయ్య, గోపగాని ఐలయ్య, చెవుగాని ఆంజనేయులు, మద్దెల ఐలుమల్లు, మునిగాల సదానందం పాల్గొన్నారు.

'నేతకాని' కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(కె) : నేతకాని కులస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏజెన్సీ నేతకాని హక్కుల పోరాట సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాడీ ఈశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో ఏజెన్సీ నేతకాని హక్కుల పోరాట సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేతకాని కులం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే అందులో నెట్‌కాని అని వస్తోందని తెలిపారు. ఏదైనా ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో నేతకాని అని, సర్టిఫికెట్‌లో నెట్‌కాని అని వస్తోందన్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు కుల సర్టిఫికెట్‌లో వచ్చే తప్పులను సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి

మొగుళ్లపల్లి : రంగాపూర్ రైతువేదికలో గురువారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య శిక్షణ కార్యక్రమంపై చిట్యాల మండల సూపర్‌వైజర్ జయప్రద ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ అవంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు ఎలా అందించాలి.. ఎందుకోసం అనే విషయాలపై సంపూర్ణ శిక్షణ ఇచ్చామన్నారు. మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల శారీరక, మానసిక కండరాల అభివృద్ధి ఆలోచన శక్తి, జ్ఞాపకశక్తి పెంపొంది నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలి అంటే పునాది గట్టిగా ఉంటే రేపటి తరం చక్కగా అన్ని రంగాలలో రాణిస్తారని ఆమె అన్నారు. మంచి అలవాట్లు, సంభాషణ, ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక , సంసిద్ధత, సాంస్కృతిక కార్యక్రమాలు–శాస్త్రీయ పరిజ్ఞానం అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించామన్నారు. శిక్షణలో సూపర్‌వైజర్ రజితతోపాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయొద్దు



గుడిసెవాసులతో మాట్లాడుతున్న అధికారులు

వాజేడు : వాజేడు, పూసూరు గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన గుడిసెలు వేయొద్దని, వేసిన గుడిసెలను వెంటనే ఖాళీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక పోలీసులు గురువారం గుడిసె వాసులకు తెలిపారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడం సరి కాదని వెంటనే వాటిని ఖాళీ చేసి వెళ్లాలని సూచించారు. గోదావరి ముంపుతో పాటు ఒకే ఇంట్లో రెండు అంత కన్న ఎక్కువ కుటుంబాలు జీవనం సాగిస్తున్నట్లు బాధితులు అధికారులకు తెలిపారు. ఈవిషయం తమకు తెలియదని ఏదైనా ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. ఇలా గుడిసెలు వేయడం మంచిది కాదని ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లి పోవాలని అధికారులు తెలిపారు. ఇంతకు ముందే కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించామని గుడిసెవాసులు చెప్పారు. గుడిసెలు ఖాళీ చేయాల్సి వస్తే తమకు వేరే చోటనైనా ఇంటి స్థలాలను చూపించాలని కోరారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వెంకటాపురం(కె) : మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం భద్రాచలం నియోజక వర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు పటేల్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయంలో మున్నూరు కాపు సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మున్నూరు కాపులు సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రత్యేక మున్నూరు కాపు కార్పొరేషన్ సాధించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జక్కుల శ్యామ్ పటేల్, కార్యదర్శి దాసరి నారాయణరావు పటేల్, నాయకులు కుసం సాంబశివరావు, బెజ్జని పూర్ణ పటేల్, బెజ్జని దేవుడు, సమ్మయ్య, సుంకర నానాజీ యడ్ల క్రాంతి, జొన్నల నాగేశ్వరావు పటేల్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా 'పీసా' గ్రామసభ

వాజేడు : నిబంధనలకు విరుద్ధంగా ఏక పక్షంగా నిర్వహించిన భువనపల్లి, భీమవరం పీసా గ్రామ సభను రద్దు చేయాలని కోరుతూ భీమవరం ఆదివాసీలు గురువారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయకు వినతిపత్రం అందజేశారు. చింతూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న భీమవరం గ్రామానికి ప్రభుత్వం ఇసుక క్వారీ నిర్వహణకు అనుమతి ఇచ్చిందని, కానీ ధర్మవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న భువనపల్లి గ్రామస్తులతో గురువారం పీసా గ్రామ సభను నిర్వహించినట్లు వారు తెలిపారు. రెండు గ్రామ పంచాయతీల్లో ఉన్న వేర్వేరు గ్రామాలను భువనపల్లి భీమవరంగా చేసి పీసా గ్రామ సభను నిర్వహించారని వినతి పత్రంలో ఆరోపించారు. పీసా గ్రామసభలో భీమవరం ప్రజలు పాల్గొన లేదని, భువనపల్లిలో ఏక పక్షంగా సభ నిర్వహించారని వారు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



గోవిందరావుపేట : వైఆర్‌జీ కేర్ లింక్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పస్రా గ్రామ పంచాయతీలో గురువారం ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ టి.కిషన్, బి.రాము హాజరై మాట్లాడారు. హెచ్ఐవీ(ఎయిడ్స్) పై అందరికి అవగాహన కలిగిఉండాలన్నారు. ప్రతి గర్భిణి హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎండి అంజుం, కారోబార్ సీతరాములు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.